ఆర్థిక క్రమశిక్షణ తీసుకొస్తాం

- ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- మంథని మండల సర్వసభ్య సమావేశం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న ఎంపీపీ శంకర్, నాయకులు

మంథని: గత ప్రభుత్వం ఖజానాలో చిల్లిగవ్వ లేకుండా చేసిందని, ఆర్థిక క్రమశిక్షణ తీసుకొచ్చి, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం మంథనిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తామన్నారు. త్వరలో సిటిజన్ చార్టర్ ప్రవేశపెడతామని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకునే అలవాటు మానేయాలన్నారు. సమస్య మీ పరిధిలో లేకుంటే దాన్ని తెలియజేస్తూ వెంటనే దరఖాస్తుదారుడికి లేఖ రాయాలని పేర్కొన్నారు. అధికారులపై ఎటువంటి రాజకీయ ఒత్తిడి ఉండదని, ప్రజలకు సుపరిపాలన అందించడంలో తమవంతు సహకారం అందించాలని కోరారు. మంథని సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా పరిశ్రమల స్థాపనకు అవకాశాలను పరిశీలించాలన్నారు. అనంతరం తాము అప్పులపాలై, ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకునేలా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో రమేశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం భట్టికి వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి, వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాల అమలు, లాభాల వాటా చెల్లింపు, వారి సమస్యలపై వివరించినట్లు పేర్కొన్నారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు సుధాకర్, మొగిలి, లక్ష్మీనారాయణ, భూమయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆర్జీ–3 జీఎం శుభాకాంక్షలు



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న జీఎం

రామగిరి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ హెచ్‌ఎంకు సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ, గ్రామస్తులు

ముత్తారం: లక్కారం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన సంపత్‌ను సోమవారం స్థానిక రామాలయం ఆవరణలో మాజీ ఎంపీపీ చంద్రమౌళి, విద్యార్థులు, గ్రామస్తులు సన్మానించారు. ఆయన ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చారని తెలిపారు. నాయకులు ఒడ్డి తిరుపతి, చంద్రమౌళి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడిపూజ



యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేసి, పదునెట్టాంబడి పూజ జరిపారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి



పూజలు చేస్తున్న భక్తులు

ఫెర్టిలైజర్‌సిటీ: 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని వల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న మహేశ్

జూలపల్లి: బీజేపీ జూలపల్లి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ సోమవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, నాయకులు శిలారపు పర్వతాలు, సంతోష్, పొల్సాని సంపత్‌రావు, రాజేశ్వర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మారంలో మల్లన్న పట్నాలు





ఎమ్మెల్యే అడ్లూరిని సన్మానిస్తున్న నాయకులు, పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండల కేంద్రంలోని శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయంలో దండివారం సందర్భంగా సోమవారం పట్నాలు వేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్మణ్‌కుమార్ గెలిస్తే దండివారం రోజు స్వామివారికి ముడుపు కడతామని గొర్రెల పెంపకందారుల సొసైటీ చైర్మన్ జంగ మహేందర్‌యాదవ్ మొక్కు మేరకు ఆయన ముడుపు కట్టారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు తుమ్మల కొమురయ్య, ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రేణుకాదేవి, నాయకులు పాల్గొన్నారు.

సన్మానించిన కటికెనపల్లి గ్రామస్తులు

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కటికెనపల్లి గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనగిరి పెద్దులు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ముల్కాల చందు, ఉపాధ్యక్షుడు కుశనపల్లి రాజు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొప్పుల పూజలు

ధర్మారంలోని శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు పుస్కూరి పద్మజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, ఉపసర్పంచ్ లత, దేవి రాజలింగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు ఉన్నారు.

రైతులకు షెడ్లు నిర్మించండి

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని: పంట పొలాల వద్ద రైతులు ఉండేలా షెడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశించారు. సోమవారం పాలకుర్తి మండల అధికారులతో స్థానిక దుర్గానగర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కోతుల సమస్య పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి ఇవ్వాలన్నారు. బెల్ట్‌షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో మెడిసిన్స్ అందుబాటులో ఉండాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కోల్‌సిటీ: 29వ డివిజన్‌లో సోమవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. పట్టణ ప్రగతికి చెందిన రూ.14 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఎమ్మెల్యే సతీమణి మనాలిరాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థిగా పాఠశాలకు రండి

రామగుండం: ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను రామగుండం హైస్కూల్ హెచ్‌ఎం అజ్మీరా శారద సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ పూర్వ విద్యార్థిగా ఎమ్మెల్యే హోదాలో పాఠశాలను సందర్శించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

సినిమా థియేటర్ ప్రారంభం



ఎమ్మెల్యేతో కలిసి థియేటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సుల్తానాబాద్: మండల కేంద్రంలో నిర్మించిన సినిమా థియేటర్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు థియేటర్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు థియేటర్ యాజమాన్యం, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే విజయరమణారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జూలపల్లి నాయకులు

జూలపల్లి: ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును జూలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం శివపల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి, మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, బాలరాజుపల్లె ఉపసర్పంచ్ అడువాల తిరుపతి, నాయకులు కొమ్మ పోచాలు, ఎదుల్ల కనుకయ్య, ఎండీ.అజీజ్, వేముల ఎనివాస్, బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణదారులు..

జూలపల్లి మండలంలోని పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణదారులు సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. సాగర్‌రావు, కృష్ణారెడ్డి, ఆంజనేయరావు, మోహన్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: ఎమ్మెల్యే వియరమణారావును కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. మారుమూల మీర్జంపేట గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మీర్జంపేట ఎంపీటీసీ మాజీ సభ్యులు మొగిలి సదానందం, పోశాల సదానందం, మాజీ సర్పంచు తిరుపతి రెడ్డి, వార్డు సభ్యుడు తొట్ల రవి తదితరులున్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తూగ నాగరాజును కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు వద్దెపల్లి రాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్‌లకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వార్డు పునరుద్ధరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి

ఓదెల: గోపరపల్లె గ్రామంలో ఎస్సీ రిజర్వేషన్ వార్డును పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఓదెల మండల అధ్యక్షుడు మాటూరి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో గతంలో 8 వార్డుల్లో ఎస్సీ వార్డు ఉండేదని, 15 ఏళ్ల క్రితం రద్దు చేశారని పేర్కొన్నారు.

బయోటెక్నాలజీలో డాక్టరేట్



సంపత్‌కుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సుభాష్‌నగర్‌కు చెందిన సంపత్‌కుమార్ బానోత్ ఐఐటీ రూర్కీలో బయోటెక్నాలజీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఆయన అమ్మమ్మ మల్లికమ్మ చౌహాన్, తాత శివలాల్ చౌహాన్ సంరక్షణలో పెరిగారు. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, మైక్రోబయాలజీలో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీ, బయోటెక్నాలజీలో ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. ఈయన డాక్టోరల్ థీసిస్ ‘ట్రాన్స్‌క్రిప్టోమిక్స్ ఆఫ్ డెవలపింగ్ మెరిస్టెమ్స్ అండర్ టెర్మినల్ హీట్ స్ట్రెస్ ఇన్ కాంట్రాస్ట్ కల్టివర్స్ ఆఫ్ బార్లీ’. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు ప్రశాంతి, వాసవ్య విద్యాలయం వ్యవస్థాపకుడు బండి చంద్రమౌళిలు ఖరగ్‌పూర్ ఐఐటీకి ఎంపికైన సమయంలో ఆర్థికంగా సాయం చేశారని తెలిపారు. భవిష్యత్‌లో పరిశోధనలు చేయడమే తన లక్ష్యమన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన విద్యార్థులు



ప్రాజెక్టు వద్ద విద్యార్థులు, టీచర్లు

ఓదెల: గ్రామంలోని మల్లికార్జుననగర్, గొల్లపల్లె పాఠశాలల విద్యార్థులు సోమవారం ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. వాటర్ స్టోరేజ్, గేట్లను చూశారు. నీటి విడుదలతో ఉపయోగాలపై టీచర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గైని రమేశ్, ఎర్రోజు కిరణ్, ఉపాధ్యాయులు అంబటి చేరాలు, కేతిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్లకు.. ఒక్కచోటకు



రామగుండం: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1982–83 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు చదివిన పాఠశాలే వేదికైంది. 40 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషపడ్డారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి టీచర్ శ్రీధర్‌రావు సన్మానించారు. అందరూ కలిసి భోజనం చేశారు. అనంతరం 2022–23వ విద్యాసంవత్సరంలో హైస్కూల్ నుంచి పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు నగదు బహుమతులను హెచ్‌ఎం శారద చేతులమీదుగా అందజేశారు. మోదుంపల్లి రామస్వామి, హన్మంతు, శంకర్, ఈ.పద్మ, ఆర్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

22 గ్రామాలకు ఒక్కరే ఆర్‌ఐ



ఓదెల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న రైతులు

- దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి తిరగాల్సిందే
- సిబ్బంది నిర్లక్ష్యంతో అర్జీలు మాయం
- విద్యార్థులు, రైతులు, ప్రజల ఇబ్బందులు
- ఓదెల తహసీల్దార్ కార్యాలయంలో పరిస్థితి

ఓదెల: మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇదివరకు ఇద్దరు ఆర్‌ఐలు పని చేసేవారు. ఆరు నెలల క్రితం ఒకరిని కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఇక్కడ కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో తమ పనులు పూర్తవక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మడక, పొత్కపల్లి, రూపునారాయణపేట, జీలకుంట, గుంపుల, ఇందుర్తి, బాయమ్మపల్లె, గూడెం గ్రామాలకు ఆర్‌ఐ లేకపోవడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు నానాతంటాలు పడుతున్నారు. దేనికోసమైనా దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కులం, నివాసం, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీసేవ ద్వారా అర్జీ పెట్టుకొని, తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తే సిబ్బంది నిర్లక్ష్యంతో మాయమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. తమకు గౌరవం లభించడం లేదని అంటున్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి, ఆర్‌ఐని నియమించాలని, స్థానిక ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

రైతులం ఇబ్బంది పడుతున్నం



ఆర్‌ఐ లేకపోవటంతో రైతులందరం ఇబ్బంది పడుతున్నం. ఒక్క అధికారి మాత్రమే ఉండటంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. మరొకరిని నియమించాలి.

– గుర్రం శ్రీనివాస్‌గౌడ్, రైతు, రూపునారాయణపేట


ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నం



మా సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నం. గంటల తరబడి ఆఫీస్‌లోనే పడిగాపులు కాస్తున్నం. సరిపడా సిబ్బంది లేక విద్యార్థులు, రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నరు.

– కొత్త నరేందర్‌రెడ్డి, రైతు, జీలకుంట

ఉన్నతాధికారులు స్పందించాలి



ఓదెల తహసీల్దార్ కార్యాలయంలో అవసరమైన సిబ్బంది లేక చివరి గ్రామాలకు ఇబ్బందులు తప్పడం లేదు. రైతులు, విద్యార్థులు ఇచ్చిన అర్జీలను మాయం చేస్తున్నరు. ధ్రువపత్రాలు సకాలంలో అందడం లేదు. ఈ పరిస్థితిపై ఉన్నతాధికాలు స్పందించాలి.

– బండారి సురేందర్, రైతు, గుంపుల

బోర్, మోటార్ అందజేత



దాతలను సన్మానిస్తున్న నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: లక్ష్మీపురం పద్మశాలీ సేవా సంఘం భవనానికి తాటికొండ లత–రవీందర్ సుమారు రూ.40 వేల విలువైన బోర్, మోటార్‌ను సోమవారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వారిని సన్మానించారు. కార్పొరేటర్ పద్మ, అధ్యక్షుడు ఒడ్నాల రాజయ్య, నాయకులు రాజయ్య, మోహన్‌కృష్ణ, సమ్మన్న, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ‘ట్రినిటీ’ విద్యార్థుల సత్తా



విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ డిగ్రీ కాలేజీ విద్యార్థులు డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటారు. శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన 5వ సెమిస్టర్ ఫలితాల్లో అవని, షాహిస్తా, రీంశఅంజుమ్, సుష్మిత, సృజన, సుమనశ్రీ, బీన్వేషిక, ఉషారాణి, సౌమ్య మంచి మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వారిని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: ఈడాక్ కరిక్యులం ఆర్గనైజేషన్ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్కూల్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్పీచెస్ విభాగంలో ఐరా మనహ, శ్రీహాస్, ఆర్ట్స్ విభాగంలో సాత్విక, సంప్రీత్ మొదటి స్థానంలో నిలిచి, పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడి నియామకం



అంజన్‌కుమార్

జ్యోతినగర్: తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్ నియమితులయ్యారు. ఇటీవల పెద్దపెల్లిలో జిల్లా ఎంఈవోటీ సురేందర్‌కుమార్ సమక్షంలో జీవశాస్త్ర ఫోరం సమావేశం నిర్వహించారు. పదోతరగతి పరీక్షల్లో భాగంగా ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని, వాటి మార్కులు, గ్రేడ్‌లను వేర్వేరుగా చూపించాలని తీర్మానించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.